క్లుప్తంగా

నియామకం



చిట్యాల: మండలంలోని చల్లగరిగలో యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని గురువారం నియమించినట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా కట్ల మహేష్, ఉపాధ్యక్షుడిగా దూడపాక శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిరిపెల్లి నరేష్, ప్రధాన కార్యదర్శిగా దూడపాక సురేందర్, సహాయ కార్యదర్శులుగా పినగాని సురేష్, గొల్లపెల్లి నగేష్, సెక్రటరీగా అల్లె ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా గొల్లపెల్లి అనిల్, దూడపాక లక్ష్మన్, అల్లె తిరుపతి, దూడపాక రాజు, వేమునూరి రాకేశ్‌లను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బండి రాజు, మండల యూత్ నాయకులు గొపగాని శివ, చిరంజీవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఐడీఓసీ మందిరంలో రేపు(శనివారం) ఉదయం 10 గంటలకు నిర్వహించే దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి సునీత గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పరామర్శ



చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండి రవీందర్ తండ్రి మొగిలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆకుల రవీందర్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సుంకరి మహేష్, మ్యాదరి స్వామి, బండి రాజు, అశోక్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, వాసు, వెంకట్రాజం, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ అలువాల కార్తీక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కార్తీక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని పథకాలు ప్రారంభించే అవకాశముందన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రతి నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకునే విధంగా మండలాల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.

దొడ్డి కొమురయ్య జయంతి

ములుగు : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను గురువారం జిల్లాకేంద్రంలోని సంక్షేమ భవన్‌లో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి (డీబీసీడీఓ) చిట్టిరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఉద్యమం పోరాటంగా మారడానికి కొమురయ్య అమరత్వమే ప్రధాన కారణం అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఆద్యుడు దొడ్డి కొమురయ్య అని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు నరిగె రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు యార మల్లయ్య, రాజబాబు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి లక్ష్మణ్ నాయక్, అధికారులు సరిత, మానస, రేణుక, ప్రతాప్, కుమారస్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ములుగు రూరల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇంచర్ల శివారులో ఎర్రిగట్టమ్మ వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన నేదునూరి కుమారస్వామి (42) మంగపేట మండలం రాజుపేట-సంగంపల్లిలో నివసిస్తున్నాడు. ఇటీవల సొంతూరికి వచ్చిన కుమారస్వామి తిరిగి రాజుపేటకు వెళ్తున్న క్రమంలో మండలంలోని ఇంచర్ల శివారులోని ఎర్రిగట్టమ్మ వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కుమారస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రయాణికులు వెంటనే కుమారస్వామిని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కుమారస్వామి మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

- మండలంలోని నాలుగు గ్రామాలకు రాని ఆర్టీసీ బస్సు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలో ప్రయాణిస్తున్న గ్రామస్తులు

మొగుళ్లపల్లి: మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా నాలుగు గ్రామాలకు ఇప్పటి వరకూ కనీసం బస్సు సౌకర్యం లేదు. మెట్టుపల్లి, గుండ్లకర్తి, మేదరమెట్ల, అంకుషాపూర్ గ్రామాల ప్రజలకు ప్రైవేట్ వాహనాలే దిక్కు అవుతున్నాయి. మెట్టుపల్లి గ్రామస్తులు వారి అవసరాల నిమిత్తం జమ్మికుంటకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు కాలినడకన వచ్చి మొట్టపల్లిలో బస్సు ఎక్కాల్సిన పరిస్థితి. అలాగే గుండ్లకర్తి, మేదరమెట్ల, అంకుషాపూర్, మెట్టుపల్లి గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే రెండు కిలోమీటర్లు కాలినడకన నడచి బస్సులో ప్రయాణించాలి. విద్యార్థులు వ్యాపారస్తులు వ్యవసాయదారులు ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. పండుగ సమయాల్లో ప్రైవేట్ వాహనదారులు ప్రజల నుంచి అధిక చార్జీలను వసూలు చేస్తున్నారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించడం సురక్షితం కాదని తెలిసినా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలకు తప్పని పరిస్థితిల్లో ప్రైవేట్ వాహనాలే దిక్కు అవుతున్నాయి. ప్రజలు ఆర్టీసీ అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా వారి సమస్యను పట్టించుకోవడం లేదు. మేదరమెట్ల, అంకుషాపూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను కోరితే రోడ్డు సౌకర్యం సరిగా లేదని సాకులు గతంలో చెప్పేవారు. కానీ ఇప్పుడు రోడ్డు సౌకర్యం ఉన్న బస్సు సౌకర్యం కల్పించడం లేదని రెండు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి తమ ఇబ్బందులను గుర్తించి బస్సు సౌకర్యాలను కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. పిల్లలను పాఠశాలకు ప్రైవేట్ వాహనాల్లో పంపిస్తున్నాం. స్కూల్ నుంచి పిల్లలు ఇంటికి చేరే వరకు భయపడుతునే ఉంటున్నాం. ప్రభుత్వం స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

- రాం శ్రీకాంత్, అంకుషాపూర్ గ్రామస్తుడు

తాగునీటి కోసం మహిళల ఆందోళన



కాలనీలో నిరసన చేస్తున్న మహిళలు

కాటారం: వేసవి కాలం ఆరంభంలోనే మండలంలోని పలు కాలనీల ప్రజలు తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. మండల పరిధిలోని రేగులగూడెంలోని తెనుగువాడ కాలనీ ప్రజలు గ్రామ పంచాయతీ ద్వారా తాగునీరు సరఫరా లేక, మిషన్ భగీరథ నీటి జాడలేక నీటి కోసం నానా పాట్లు పడుతున్నారు. కొన్ని రోజులుగా తాగునీరు సక్రమంగా అందడం లేదని ఆరోపిస్తూ గురువారం కాలనీలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఇప్పటి వరకూ ఒక రోజు కూడా మిషన్ భగీరథ నీరు అందిన దాఖలాలు లేవని, గ్రామ పంచాయతీ ద్వారా నీటి సరఫరా జరగడం లేదని వారు ఆరోపించారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం దూరం వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోయారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణిని వివరణ కోరగా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడుతుందన్నారు. తెనుగువాడ ఎత్తులో ఉన్నందున నీటి సరఫరా జరగడం లేదని ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీని దేశంనుంచి తరిమికొట్టాలి



భూపాలపల్లి రూరల్: నాయకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రకాశ్‌రెడ్డి

- రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్/మల్హర్: మతతత్వ బీజేపీని దేశం నుంచి తరిమికొట్టేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో, మల్హర్‌మండల కేంద్రంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పేరిట రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను గురువారం ప్రకాశ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతలు గాంధీ, అంబేడ్కర్, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ మాట్లాడుతున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ.. ప్రజల హక్కులను కాలరాస్తుందన్నారు. బలహీన వర్గాలకు అందాల్సిన ఫలాలు అందకుండా చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుందని ఆరోపించారు. భూపాలపల్లిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు విస్లావత్ దేవన్, నాయకులు దాట్ల శ్రీనివాస్, పట్టణ కోఆర్డినేటర్ అశోక్, పీసీసీ సభ్యుడు దబ్బుట రమేష్, చల్లూరి సమ్మయ్య, సజ్జనపు స్వామి, హారిక మల్హర్‌లో కాంగ్రెస్ దళిత విభాగం జిల్లా చైర్మన్ దండు రమేశ్ పాల్గొని మాట్లాడారు. మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి, జిల్లా ఉపాధ్యక్షుడు అయిత రాజిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఓరం సమ్మయ్య, మండల మహిళ అధ్యక్షురాలు కొండ రాజమ్మ, గడ్డం ప్రేమ్ కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం పాదయాత్ర

కాటారం: రాజ్యాంగ పరిరక్షణ కోసం గ్రామగ్రామాన పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చింతకాని, ఇబ్రహీంపల్లి, బయ్యారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, యూత్ అధ్యక్షుడు చీటూరి మహేశ్‌గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, నాయకులు చీమల వెంకటస్వామి, దబ్బెట రాజేశ్, కుంభం రమేశ్‌రెడ్డి, కర్క ఉమాశంకర్, కొట్టె శ్రీహరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజతోత్సవాలకు హాజరు కావాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: బీఆర్ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో నిర్వహించనున్న రజతోత్సవాలకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్ల కోసం గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం నుంచి 20 నుంచి 30వేల మంది కార్యకర్తలు పాల్గొనేలా కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఇందుకు రావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు జనార్ధన్, సంపత్‌కుమార్, రమేశ్‌లు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి

భూపాలపల్లి అర్బన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలని ఏబీవీపీ పట్టణ ఉపాధ్యక్షుడు కొలికపొంగు విగ్నేష్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ భూముల వేలాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ ఎన్నో జీవరాశులకు నిలయంగా మారిందన్నారు. వాటిని రక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాలు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం విచక్షణ రహితంగా లాఠీచార్జీ చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయితేజ, విష్ణు, ఈశ్వర్ పాల్గొన్నారు.

నాయకుల అరెస్ట్ సరికాదు



పోలీసుల అదుపులో ఏబీవీపీ నాయకులు

ములుగు రూరల్ : హెచ్‌సీయూ భూములను వేలం వేయొద్దని విద్యార్థి సంఘాల నాయకులు చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తే పోలీసులు వారికి అరెస్టు చేయడం సరికాదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మమున్ యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం వేలం వేయడం సరికాదని పేర్కొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పురాతనమైన శివాలయ పునర్నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన బీరవోలు నిర్మల-త్రిలోకేందర్‌రెడ్డి దంపతులు గురువారం రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. అందులో భాగంగా ముందుగా రూ. 50వేలను ఆలయ కమిటీ అధ్యక్షుడు కసిరెడ్డి రత్నాకర్‌రెడ్డికి అందజేశారు. విరాళం అందజేసిన దంపతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మోత్కురి నరేష్, సర్వ శరత్, మండల రాఘవరెడ్డి, కోక్కుల సారంగం, తీగల నాగరాజు, చెక్క నర్సయ్య, శంకర్, కాల్వ సమ్మిరెడ్డి, రాజయ్య, రవి, రాజు పాల్గొన్నారు.

108, 102 సేవలను విస్తరింపజేయాలి



మాట్లాడుతున్న డిస్టిక్ మేనేజర్ నరేశ్

కాటారం: 108, 102 ద్వారా అందుతున్న ఎమర్జెన్సీ సేవలను మారుమూల గ్రామాలకు మరింత విస్తరించేలా ఆశకార్యకర్తలు, వైద్యసిబ్బంది కృషిచేయాలని డిస్ట్రిక్ మేనేజర్ మేరుగు నరేశ్ తెలిపారు. మండలకేంద్రంలోని అయ్యప్ప ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆశ డే సందర్భంగా ఏఎన్‌ఎం, ఆశలకు 108, 102 ద్వారా అందుతున్న సేవలు, ఏ విధంగా ఉపయోగించుకోవాలని అవగాహన కల్పించారు. వేసవికాలంలో వడదెబ్బకు గురైతే వైద్య సిబ్బంది వెంటనే 108కి సమాచారం అందించాలని.. అంబులెన్స్‌లో వడదెబ్బకు సంబంధించిన ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఐస్ ప్యాక్ చిల్లర్ బాక్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు అత్యవసర సమయాల్లో, గర్భిణులు, ఎన్‌సీపీఎంసీ చెకప్స్, డెలివరీ తర్వాత మదర్ అండ్ చైల్డ్‌ను ఇంటి వద్ద చేర్చడానికి 108, 102 సేవలను వినియోగించుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, 108 స్టాఫ్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శ్రీకాంత్, పైలట్ విజేందర్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువైద్య సేవలు సక్రమంగా అందించాలి

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కుమారస్వామి



రికార్డులను పరిశీలిస్తున్న డీవీహెచ్ఓ

కాటారం: గ్రామాల్లో పశువులకు, మూగజీవాలకు పశువైద్య శాఖ ద్వారా సంక్రమంగా వైద్య సేవలు అందించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి అసోడ కుమారస్వామి వైద్యులకు సూచించారు. మహాముత్తారం మండలకేంద్రంలోని పశువైద్యశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందులపై ఆరా తీశారు. గ్రామాల్లో పశువుల, మూగజీవాల దాహార్తిని తీర్చడం కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టిలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పశువులు, మూగజీవాలకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవికాలంలో పశువులకు సోకే వ్యాధులు, నివారణ చర్యలు, వడదెబ్బ, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించాలని పశువైద్య సిబ్బందిని ఆదేశించారు. పశుసంవర్ధకశాఖ అధికారి వెంట డాక్టర్ భరత్‌బాబు, సిబ్బంది అశోక్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

ఉపాధ్యాయుల్లో బోధన తీరు మెరుగుపడాలి

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల బోధన తీరు మెరుగుపర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అకాడమీక్ మానిటరింగ్ అధికారి(ఏఎంఓ) కాగిత లక్ష్మణ్ సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గోనె శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ఏఎంఓ కాగిత లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్ తెలుగు 61 మంది, స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ 23 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ శిక్షణలో సమర్థవంతమైన తరగతి గది బోధన, అభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన పద్ధతులు, అభ్యసన అభివృద్ధి కార్యక్రమాలు, అందుబాటులో గల సాంకేతిక పరికరాల వినియోగం ఇతర విషయాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనలో శక్తి సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా పాఠశాలలను అభివృద్ధిలోకి తేవడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ఈ శిక్షణ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఉద్యోగ పదోన్నత పొందిన ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయులతో కలిసి నిరంతరం కొత్త విషయాలు తెలుసుకొని సమగ్ర విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రిసోర్స్ పర్సన్లు మురళి, సురేష్, రాజబాబు, లక్ష్మయ్య, బయాలజీకల్ సైన్స్ రిసోర్స్ పర్సన్లు వీణావాణి, శ్రీనివాస్ పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం సందర్భంగా గురువారం మండలంలోని రామకిష్టాపూర్ (వి)లో బ్లాక్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాంపెల్లి వీరేశం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడం మూలంగా ఎవరూ కూడా తినలేక అమ్ముకున్నారని అన్నారు. ప్రజా పంపిణీ కార్యక్రమం ప్రజలకు ఉపయోగపడాలనే లక్ష్యంతో సీఎం రెంవత్‌రెడ్డి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నారని అన్నారు. దీని ద్వారా దళారుల చేతికి బియ్యం పోకుండా అడ్డుకట్ట వేశారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎడ్ల రమేష్, మాజీ సర్పంచ్ అడగాని రామారావు, చేరాలు, వీరన్న, లద్దునూరి పోశాలు, రజినీకాంత్, డీలర్ ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు



ఏటూరునాగారం: పసుపు కొమ్ములను దంచుతున్న మహిళలు



ఏటూరునాగారం: గోటి తలంబ్రాలను ఊరేగిస్తున్న మహిళలు



వాజేడు: చీకుపల్లిలో సిద్ధం చేసిన యాగశాల

రామాలయంలో పసుపు దంచుడు కార్యక్రమం

- గోటి తలంబ్రాల ఊరేగింపు
- ఆలయంలో భక్తుల సందడి

ఏటూరునాగారం : సీతారాముల కల్యాణ వేడుకకు కావాల్సిన సామగ్రిని మహిళలు సిద్ధం చేస్తున్నారు. మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం పసుపు దంచుడు కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు, మహిళా భక్తులు నిర్వహించారు. ఈనెల 6వ తేదీన (ఆదివారం) రాములోరి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పసుపు దంచుడు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మహిళలంతా కలిసి పసుపు కొమ్ములను దంచి పసుపు తయారు చేసి పూజా కార్యక్రమాలను చేపట్టారు. మహిళలకు ఆలయ నిర్వాహకులు వాయినాలను అందజేశారు. దీంతో ఆలయం సందడిగా మారింది.

భద్రాచలం నుంచి తలంబ్రాలు

భద్రాచలంలోని సీతారామచంద్రుడి సన్నిధి నుంచి గోటితో ఒలిచి ప్రత్యేకంగా పూజలు చేసిన గోటితలంబ్రాలను ఊరేగింపుగా మండల కేంద్రంలోని రామాలయానికి భక్తులు, ఆలయ నిర్వాహకులు గురువారం సాయంత్రం తీసుకువచ్చారు. గోటి తలంబ్రాలకు అర్చకులు యల్లప్రగడ నాగేశ్వర్‌రావు శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపులో మహిళలు కోలాటాలు, నృత్యాలు చేశారు. కార్యక్రమంలో అలువాల శ్రీనివాస్, దీనబాంధువ స్వామి, కత్తెర శ్రీనివాస్, వేణుగోపాల్ లాహోటి, పోగుల లక్ష్మీనారాయణ, చెన్న రాంబాబు, గడ్డం వినయ్, సదానందం, ఎగ్గడి జగదీష్, తాడూరి రఘు, శశి, శివ, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న రామాలయాలు

వాజేడు : శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని రామాలయాలను భక్తులు, నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 6వ తేదీన వైభవంగా సీతా సమేత రాముడి కల్యాణ మహోత్సవం జరుగనుంది. ఆలయ కమిటీలు, నిర్వాహకులు, భక్తులు ఆలయాలను ఇప్పటికే సిద్ధం చేశారు. కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా ఏర్పాట్లను చేశారు. మండలంలోని వాజేడు, చీకుపల్లి, పేరూరు, శ్రీరాంనగర్, మొరుమూరు, పెద్ద గొల్లగూడెం, జగన్నాథపురం, ఏడ్జర్లపల్లి గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించనున్నారు. చీకుపల్లి రామాలయం వద్ద యాగశాలను సిద్ధం చేశారు.

గంజాయి స్వాధీనం



మంగపేట : మండలంలోని కమలాపురంలో తనిఖీ చేస్తుండగా గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై వివరాలను వెల్లడించారు. కమలాపురంలోని రామన్నగూడెం క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన కుమ్మరి మోహన్‌రావును అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద 475 గ్రాముల రూ.25,000 విలువైన ఎండు గంజాయి ప్యాకెట్, సెల్‌ఫోన్ లభించిందని అన్నారు. ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లికి చెందిన కుమ్మరి నారాయణ కుమారుడిగా గుర్తించినట్లు ఎస్సై వెల్లడించారు.